జనగామ ప్రజలు కేసీఆర్ వెంటే



పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి



పల్లా ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన తిరుపతిరెడ్డి, రమేష్

- అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి
- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కారుగుర్తుకు ఓటు వేయండి
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: ఉవ్వెత్తున ఎగిసి పడిన తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ వెంట నడిచిన చేర్యాల, జనగామ ప్రాంత బిడ్డలు ఈ సారి ఎన్నికల్లో మూడో సారి సీఎం చేసేందుకు నడుంబిగించారని బీఆర్‌ఎస్ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలోని వికాస్‌నగర్ క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో చేరికలతో పాటు పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తపాస్‌పల్లి, మల్లన్న సాగర్ రిజర్వాయర్ల పరిధిలో మిగిలిన డిస్ట్రిబ్యూషన్ కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. జనగామ నియోజకవర్గంలో మరో 10వేల మందికి గృహలక్ష్మి పథకంలో అవకాశం కల్పిస్తామని చెప్పారు. రైతు రుణమాఫీ, వడ్లురాలిన పరిహారం వందశాతం రాకపోవడానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో నిలుపుదల చేశారని తెలిపారు. ఎలక్షన్ పూర్తి అయిన వెంటనే, ప్రతీ లబ్ధిదారుడికి రుణమాఫీ, ధాన్యం పరిహారం ఖాతాలో జమ చేస్తామన్నారు. పల్లా ఎక్కడ నుంచి వచ్చారని కొంత మంది బుద్ధిలేని వ్యక్తులు మాట్లాడుతున్నారని, తాను జనగామ జిల్లా వాసినే అని అన్నారు. జైలు జీవితం గడిపిన బ్రోకర్ రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌పై అవాకులు, చెవాకులు పేలితే ఊరుకునేది లేదన్నారు.

అభివృద్ధికి నమూనా తెలంగాణ..

రాష్ట్రంలో క్రైస్తవుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో పని చేస్తున్నారని పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక కెమిస్ట్రీ భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పల్లా అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. మూడో సారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాస్టర్లకు గౌరవ వేతనం ఇప్పించేలా కృషి చేస్తామన్నారు. ఇల్లు లేని



పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

పేద పాస్టర్లకు మొదటి విడతలోనే గృహాలు మంజూరు చేయిస్తామని తెలిపారు. నిరుద్యోగ నిర్మూలన కోసం ఇండస్ట్రీలను తీసుకువస్తామని చెప్పారు. జిల్లాకు నర్సింగ్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలను తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ హిందూ ధర్మాన్ని బలంగా నమ్ముతారని, అదే సమయంలో ఇతరుల నమ్మకాలను కూడా గొప్పగా గౌరవిస్తారని తెలిపారు. క్రిస్టియన్లు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

ఇంటింటా ప్రచారం..

జనగామ పట్టణంలోని 20,21 వార్డుల్లో పల్లా సతీమణి నీలిమ, కౌన్సిలర్లు కర్రె శ్రీనివాస్, జూకంటి లక్ష్మీశ్రీశైలం, నాయకులు మామిడాల రాజు, తదితరులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టో వందశాతం అమలు కావాలంటే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు.

చేర్యాలకు తరలిన పార్టీ శ్రేణులు, ప్రజలు..

చేర్యాలలో నిర్వహించిన సీఎం కేసీఆర్ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి వెళ్లారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, మాజీ చైర్‌పర్సన్ గాడిపల్లి ప్రేమలతారెడ్డి, బండ పద్మ, నాయకులు బండ యాదగిరిరెడ్డి, నిమ్మతి మహేంద ర్‌రెడ్డి, బాల్దె సిద్దిలింగం, ఎండి సమ్మద్, నీల యాదగిరి, నీల రాంమ్మోహన్, బిజ్జాల నవీన్ గుప్తా, మేల్లవరపు అరవింద్‌రెడ్డి, మసిఉర్ రెహాన్, ఎస్వరూప, వాంకుడోత్ అనిత, పాక రమ ఉన్నారు.



జనగామలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్‌కు ఓటేసి కష్టాలు తెచ్చుకోవద్దు

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేసి పాత కష్టాలను తెచ్చుకోవద్దని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డినగర్ వద్ద చేర్యాలలో నిర్వహించిన సీఎం కేసీఆర్ బహిరంగ సభకు వెళ్లే వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించి అసెంబ్లీకి పంపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి, సర్పంచ్ కోనేటి స్వామి, మూసిని సునీత, మూసిని రాజు, చెవాన్ నరేష్, సత్యనారాయణ, కాలియా చిట్టిబాబు, శేఖర్ రెడ్డి, రాములు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి..

సాధారణ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ సీనియర్ నాయకుడు కొండి వెంకట్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో ఇంటింటా తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు. సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, యూత్ అధ్యక్షుడు వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి, నాయకులు బొమ్మెన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మండలంలోని వివిధ పార్టీల నాయకులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. శనివారం సీఎం కేసీఆర్ సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణానికి వచ్చిన సందర్భంగా దబ్బగుంటపల్లి, పడమటికేశ్వాపూర్‌కు చెందిన నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి కేసీఆర్ కండువా కప్పి ఆహ్వానించారు.

బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వండి



జనగామలో ఇంటింటా ప్రచారం చేస్తున్న దశమంతరెడ్డి



జనగామ 25వ వార్డులో ప్రచారం చేస్తున్న దశమంతరెడ్డి కోడలు సాహితీరెడ్డి

- 60 ఏళ్లు కాంగ్రెస్, 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అంతా శూన్యమే
- బీజేపీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి

జనగామ: 60 ఏళ్లు కాంగ్రెస్, 10 ఏళ్ల బీఆర్‌ఎస్‌కు రాష్ట్రంలో అధికారం కట్టబెట్టిన ప్రజలు.. అన్ని వర్గాల అభివృద్ధికి ఈ సారి జరిగే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని బీజేపీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా పట్టణంలోని 5, 6, 7, 8, 18, 19వ వార్డుల్లో ఆయన పర్యటించారు. ఆయా వార్డుల్లో దశమంతరెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం దశమంతరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చెప్పే మాటలు నమ్మి మోసపోతే గోసపడక తప్పదన్నారు. కాంగ్రెస్ ఆరు దశాబ్దాల పరిపాలనలలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని, ఉద్యమ ముసుగులో అధికారం దక్కించుకున్న కారు పార్టీ మోసపూరిత మాటలు, వాగ్దానాలతో కాలం వెళ్లదీసిందని తెలి పారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలన్నీ కాగి తాలకే పరిమితమై పోయాయని, సొంతింటి కల సాకారం చేసుకునేందుకు వేలాది మంది నిరుపేదలు బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే వెన్నుపోటు పొడిచి, ఇప్పుడు ఓట్లు వేయాలని ప్రజల వద్దకు వెళ్లడం సిగ్గుచేటన్నారు. కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డులు, అందులో పేర్ల నమోదు, అన్ని వర్గాలకు నూతన పింఛన్లు ఇవ్వకుండా దుర్మార్గమైన పాలన చేసిన బీఆర్‌ఎస్‌ను ఇంటికి సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంతానికి కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలు ఇంకా మరువ లేదని, కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే తెలంగాణకు అధిక నిధులు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ అమలు చేస్తున్న పథకాలకు కేంద్రమే నిధులు ఇస్తుందన్నారు. ప్రజలు ఆ రెండు పార్టీలను పక్కనపెట్టి కమలం గుర్తుకు ఓటేసి ఆశీర్వదిస్తే, స్థానికుడైన తాను ప్రజలకు అందుబాటులో ఉంటూ జనగామ అభివృద్ధికి పని చేస్తామని తెలిపారు. కాగా, పట్టణంలోని 25, 26వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి కోడలు డాక్టర్ ఆరుట్ల సాహితీరెడ్డి ఇంటింటా ప్రచారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీంలు, అభివృద్ధిని వివరిస్తూ కమలం గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు.

మాటకు కట్టుబడే పార్టీ కాంగ్రెస్

ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలీశర్మ

లింగాలఘణపురం/స్టేషన్‌ఘన్‌పూర్: ఇచ్చిన మాటకు కట్టుబడే పార్టీ కాంగ్రెస్ అని అందుకే సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని, మోసం చేసే బీఆర్‌ఎస్ దళిత సీఎం, ఇంటికో ఉద్యోగం అంటూ బీఆర్‌ఎస్ పార్టీ మోసం చేసిందని ఏఐసీసీ అధికార ప్రతినిధి డాలీశర్మ, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం లింగాలఘణపురం మండలంలోని సిరిపురంలో వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దళితులను మోసం చేశారని, యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి మంత్రిగా, ఎంపీ, ఎమ్మెల్సీగా ఉండి ఏమీ చేయలేదని, మహిళా అభ్యర్థిపై



మాట్లాడుతున్న డాలీశర్మ, పాల్గొన్న వి.హన్మంతరావు

అనుచితంగా మాట్లాడిన ఆయనను ఓడించాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర, నాయకులు శివకుమార్, దిలీప్‌రెడ్డి, జగదీశ్‌చందర్ రెడ్డి, సర్పంచ్‌లు విజయ్‌మనోహర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్టేషన్‌ఘన్‌పూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాలీశర్మ మాట్లాడారు.

సమస్యల పరిష్కారానికి కృషి



జనగామ: అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న యాసారపు కరుణాకర్‌ను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాడని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ప్రధాన కార్యదర్శి కొలిపాక రాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరుణాకర్‌కు నియోజకవర్గ సమస్యలపై అవగాహన ఉందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పలక గుర్తుకు ఓటు వేసి గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

సీపీఎంను గెలిపిస్తే జనగామ అభివృద్ధి

జనగామ: జనగామ నియోజకవర్గంలో సీపీఎంను గెలిపిస్తే సమగ్రాభివృద్ధి కోసం పాటు పడతామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గుండ్లగడ్డ, వెంకన్న కుంట, ధర్మకంచ, సంజయ్ నగర్, అంబేడ్కర్ నగర్, పాల కేంద్రం బెల్లెహేంపురంలో ఇంటంటా ప్రచారం చేపట్టారు. పుప్పాల శ్రీకాంత్, ఇర్రి అహల్య, రమేష్, బొట్ల శ్రీనివాస్, ప్రకాష్, గోపి ఉన్నారు.

సీఎం సభకు అధిక సంఖ్యలో తరలి రావాలి

చిల్పూరు: ఈనెల 20(సోమవారం)న శివారెడ్డిపల్లి వద్ద నిర్వహించే సీఎం సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావాలని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మండలంలోని రాజవరంలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అలాగే మల్కాపూర్‌లో గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు సమావేశం ఏర్పాటు చేసి బహిరంగ సభకు భారీ ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్: స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల కేంద్రంలో కళాకారులు ప్రజలకు శనివారం అవగాహన కల్పించా రు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కావొద్దన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బచ్చన్నపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కేసిరెడ్డిపల్లి బీఆర్‌ఎస్ నాయకుడు ఇమ్మడి జితేందర్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో యువకులకు ఆట వస్తువులను అందజేశారు.

సెల్ టవర్ ఏర్పాటుకు తీర్మానం

తరిగొప్పుల: మారుమూల ప్రాంతమైన తమ గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేయాలని మండలంలోని జాలుబాయి తండా సర్పంచ్ సభావత్ కాళీ కోరారు. శనివారం ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశంలో సెల్ టవర్ ఏర్పాటు కావాల్సి స్థలాన్ని ఇవ్వడానికి గ్రామపంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జాలుబాయి తండాతో పాటు సమీప గ్రామాలు మాన్‌సింగ్‌తండా, భోజ్యాతండా, బొత్తలపర్రెలో సుమారుగా 2 వేల మంది ప్రజలు నివసిస్తున్నారని సెల్ టవర్స్ అందుబాటులో లేకపోవడంతో సిగ్నల్ సమస్య తలెత్తి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జాలుబాయి తండా శివారు సేవాలాల్ మహరాజ్ గుడి వద్ద బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయడానికి సర్వేనంబర్ 49/హెచ్‌లో 2 గుంటల స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. తీర్మాన పత్రాన్ని బీఎస్ఎన్ఎల్ వరంగల్ జనరల్ మేనేజర్‌కు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మి,సబావత్ రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతి

చిల్పూరు: శుక్రవారం రాత్రి జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వసంత ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీకడియం శ్రీహరి బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. అలాగే రూ. 5వేలు పంపగా నాయకులు కుటుంబ సభ్యులకు అందజేశారు.

పరామర్శ

పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన ముద్రకోళ్ల పిచ్చమ్మ(68)అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, శనివారం మంత్రి దయాకర్‌రావు సతీమణి ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదేవి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గీత కార్మికుడికి గాయాలు

రఘునాథపల్లి: ప్రమాదవశాత్తు గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలోని కన్నాయపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బీసు యాదగిరిగౌడ్ రోజు వారీగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. కాలు విరిగి, తలకు బలమైన గాయాలతో ఉన్న యాదగిరిగౌడ్‌ను గీత కార్మికులు గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన గీత కార్మికుడికి మెరుగైన వైద్యం అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు కోరుతున్నారు.

కేసు నమోదు

రఘునాథపల్లి: మండలంలోని పొట్టిగుబ్బటితండాలో ఉమ్మడి వ్యవసాయ బావి విద్యుత్ బిల్లు చెల్లించాలని అడిగిన మాలి బాలాజీపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాగర్ల రఘుపతి శనివారం తెలిపారు. పొత్తుల వ్యవసాయ బావి వాటా విద్యుత్ బిల్లు ఇవ్వాలని బాలాజీ అడగడంతో మందవర రాములుతో అతని కుమారుడు నాగేష్ ఇరువురు కర్రతో దాడి చేశారు. దీంతో బాలాజీ తలకు బలమైన గాయాలు కావడంతో బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు దాడి చేసిన తండ్రీ, కుమారుడిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉచిత విద్యుత్ ఇచ్చింది కాంగ్రెస్సే..



తండాలో మహిళలకు గ్యారంటీ స్కీంలు వివరిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామ: హమాలీ భవనం వద్ద ప్రచారం చేస్తున్న కొమ్మూరి

- ప్రజలను మోసం చేసిన పార్టీ బీఆర్‌ఎస్
- దమ్ముంటే పల్లా ఎమ్మెల్సీకి రాజీనామా చేసి పోటీ చేయాలి
- కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ రూరల్: ఉచిత విద్యుత్ ఇచ్చింది కాంగ్రెస్.. ప్రజలను మోసం చేసింది బీఆర్‌ఎస్ పార్టీ అని, దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి తనతో పోటీ పడాలని కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సవాల్ విసిరారు. శనివారం మండలంలోని చౌడారం, మరిగడి, పెద్దతండా, టాక్యాతండా, అడవికేశాపూర్ గ్రామాల్లో ప్రతాప్‌రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా మరిగడిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు వివరించారు. పదేళ్ల పాలనలో ప్రజలు కష్టాలు పడ్డారని, ధరణి పేరుతో చేసిన మోసం గ్రామాల్లో రైతులందరికీ తెలుసన్నారు. ఏళ్ల తరబడి భూమి కోసం తిరుగుతున్నారని విమర్శించారు. ఏ గ్రామంలో చూసినా ఇందిరమ్మ ఇళ్లే కనిపిస్తున్నాయని, డబుల్ బెడ్రూంలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. కనీసం రోడ్లు లేని పరిస్థితి ఉందని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేర్యాలను అభివృద్ధి చేశానని తెలిపారు. 12 ఎకరాల భూమి కొనుగోలు చేసి జూనియర్ కళాశాల, గురుకులాలు ఏర్పాటు చేశానన్నారు. పల్లా జనగామకు ఏం చేశారో చెప్పాలని, మాయ మాటలకు ఆగం కావొద్దని, డబ్బుమూటలతో వచ్చిన వ్యక్తికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు సుంకరి శ్రీనివాస్, సర్వాల నర్సింగరావు, యూత్ అధ్యక్షుడు బనుక శివరాజ్, మహిళ అధ్యక్షురాలు బడికె ఇందిర, ఎంపీటీసీలు మెరుగు బాలరాజు, సలేంద్ర మహేశ్వరీ శ్రీనివాస్,మాజీ ఎంపీటీసీ దూడల సిద్దయ్య, మాజీ ఎంపీపీ ధర్మగోవర్దన్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ఆరు గ్యారంటీ పథకాలు..

జనగామ: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అన్ని వర్గాలకు అందిస్తామని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 24వ వార్డు, పాత బీటు బజార్‌లో ఆయన ఇంటింటా



ఇస్త్రీ చేస్తూ ఓటు అడుగుతున్న ప్రతాప్‌రెడ్డి

ప్రచారం చేశారు. హమాలీ కార్మికుల భవనం వద్దకు వెళ్లి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంల గురించి అవగాహన కల్పించి, చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన వెంట కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ గంగరబోయిన మల్లేశం, జాయ మల్లేశం ఉన్నారు. 2, 3, 5, 9, 19వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి గడపగడపకు ప్రచారం చేశారు. 2వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు రాంరెడ్డి, సంజీవరెడ్డి కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువాకప్పి స్వాగతించారు. ఆయన వెంట చెంచరపు శ్రీనివాస్‌రెడ్డి, వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, చారబుడ్ల రాందయాకర్ రెడ్డి, ముస్త్యాల చందర్, వెంకటేశ్వర్లు ఉన్నారు. స్థానిక 15, 16వ వార్డు పరిధిలోని సంజయ్‌నగర్, చమన్ ఏరియా ఆంజనేయస్వామి ఆలయంలో కొమ్మూరి కోడలు దివ్య ప్రత్యేక పూజలు చేసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. కౌన్సిలర్ గాదెపాక రాంచందర్, రాంన ర్సమ్మ, భిక్షపతి, శ్రీశైలం, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డికి మద్దతుగా తీన్మార్ మల్లన్న టీం

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గెలుపునకు శనివారం తీన్మార్ మల్లన్న టీం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా టీం జిల్లా అధ్యక్షుడు తుప్పతి శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీఆర్ అరాచక పాలన పోవాలంటే కాంగ్రెస్‌కు అన్ని వర్గాల ప్రజలు పూర్తి మద్దతు తెలుపాలన్నారు. ముఖ్యంగా యువతను ఉద్యోగాల పేరుతో దగా చేసిన కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో టీం జిల్లా ప్రధాన కార్యదర్శి మంద దిలీప్, స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్, పాలకుర్తి నియోజకవర్గ మండల అధ్యక్షుడు బ్రహ్మచారి ఉన్నారు.

ప్రతాప్‌రెడ్డిని ఆదరించండి

బచ్చన్నపేట: నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని ఆయన సతీమణి



బచ్చన్నపేటలో ఆరు గ్యారంటీ కార్డులను అందజేస్తున్న అరుణ

కొమ్మూరి అరుణ కోరారు. శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఈ ప్రాంత కరువును తీర్చడానికి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గోదావరి జలాలను తీసుకొచ్చారని గుర్తుచేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీలు నల్లగోని పుష్ప, అల్వాల రాధ, మహిళా నాయకులు వేణువందన, బుర్రా బాలమణి, లీల, రేవత, కవిత, నాయకులు బాలకిషన్‌గౌడ్, ఎల్లయ్య, మహాత్మాచారి, అయిలుమల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

అందుబాటులో ఉండే నాయకుడిని గెలిపించాలి

సాధారణ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గంలో అందుబాటులో ఉండే నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నల్లగోని బాలకిషన్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ఆయన నాయకులతో కలిసి ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు కోడూరి మహాత్మాచారి, బాల్నె రాజేష్, గాలి కృష్ణ, వేణువందన బుర్రా బాలమణి, గౌస్, మోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొమ్మూరి తరఫున కోడలు ప్రచారం..

తరిగొప్పుల: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆయన కోడలు మండలకేంద్రంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్, కోఆర్డినేటర్ వగలబోయిన యాదగిరి, పండుగ కనుకయ్య, గాలి ఐలయ్య, గోరంతల వీరన్న, పోషయ్య, లూకా పాల్గొన్నారు.